# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 63 | బుధవారం | 30 ఆగస్టు 2023 | పేజీలు : 08 | వెల రూ. 5





## ఘనంగా పబ్లిక్ టీవీ న్యూస్ పదో వార్షికోత్సవం

సీనియర్ జర్నలిస్టులకు ఘన సన్మానం

8లో..

పెరిగిపోతున్న నేర ప్రవృత్తి

చెలరేగిపోతున్న అసాంఘిక శక్తులు

వారం రోజుల క్రితమే విశ్రాంత ఉద్యోగి హత్య

అది మరువక ముందే శివనగర్‌లో రౌడీ షీటర్ హత్య

కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న వరుస సంఘటనలు



# రెచ్చిపోతున్నారు..



కొంత కాలంగా ప్రశాంతంగా ఉన్న వరంగల్ నగరంలో అసాంఘిక శక్తులు రెచ్చిపోతున్నాయి. రౌడీయిజం మళ్లీ జడలు విప్పుతోంది. వరంగల్ కమిషనరేట్ పరిధిలో ప్రతి రోజు ఎక్కడో ఒక ప్రాంతంలో ఏదో ఒక సంఘటన జరుగుతూ ఇటు నగర ప్రజలకు, అటు పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వారం రోజుల క్రితమే అండర్ రైల్వే గేటు ప్రాంతంలో విశ్రాంత ఉద్యోగి గొంతు కోసి హత్య చేసిన సంఘటన మరువక ముందే శివనగర్ లో రౌడీ షీటర్ హత్య కలకలం రేపుతోంది. నేర రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్ కృషి చేస్తుంటే ఆయనకే సవాల్ విసురుతున్నట్లు దాడులు, దౌర్జన్యాలు, దోపిడీలు, హత్యలు పెచ్చుమీరడాన్ని పోలీసులు జీర్ణించుకోలేకపోతున్నారు.

**- వరంగల్ వాయిస్ ప్రతినిధి**

వివరాలు 2లో..





పాఠకులకు, ప్రకటన కర్తలకు, శ్రేయోభిలాషులకు రక్షా బంధన్ శుభాకాంక్షలు. పర్వదినం సందర్భంగా గురువారం పత్రికా కార్యాలయానికి సెలవు. పునర్ దర్శనం శుక్రవారం..






## బోనమెత్తిన ఎమ్మెల్యే

ఘనంగా పోచమ్మ బోనాల పండుగ

తరలి వచ్చిన మహిళా భక్తులు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** శ్రావణ మాసం అంటేనే మహిళలకు పండుగల సమయం. బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో మహిళలు ఘనంగా పోచమ్మ బోనాల పండుగను నిర్వహించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోని శంభునిపేట ( **మిగతా 8లో..** )



## ఈ-వేస్ట్ మిషన్ ఆవిష్కరణ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఎలక్ట్రానిక్ వేస్ట్ నిర్వహణ, రీసైక్లింగులో దేశంలో తొలిసారిగా మిషన్ ఇ-వేస్ట్ పేరుతో వినూత్న కార్యక్రమానికి మల్టీ బ్రాండ్ మొబైల్స్ రిటైల్ చైన్ సెలెక్ట్ మొబైల్స్ శ్రీకారం చుట్టింది. హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ చేతులమీదిగా బుధవారం మిషన్ ఇ-వేస్ట్ ను ఆవిష్కరించారు. పనికిరాని మొబైల్ ఫోన్లు, ల్యాప్ టాప్ లు, వ్యక్తిగత ఎలక్ట్రానిక్ పరికరాలు, మౌస్, కీబోర్డు వంటి పెరిపెరల్స్ తో సహా అనేక రకాల ఎలక్ట్రానిక్ పరికరాలను ఇ-వేస్ట్ గా పరిగణిస్తారని వీటి వ్యర్థాలతో వచ్చే సమస్యలు ఆందోళనకరంగా ఉన్నాయన్నారు. ( **మిగతా 2లో..** )

# రెచ్చిపోతున్నారు..



**పెరిగిపోతున్న నేర ప్రవృత్తి**

**చెలరేగిపోతున్న అసాంఘిక శక్తులు**

**వారం రోజుల క్రితమే విశ్రాంత ఉద్యోగి హత్య**

**అది మరువక ముందే శివనగర్‌లో రౌడీ షీటర్ హత్య**

**కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న వరుస సంఘటనలు**

తెలంగాణలో రెండో అతి పెద్దనగరం ఇప్పుడు అక్రమార్కులకు అడ్డాగా మారుతోంది. నేరస్తులు, మాఫియా ముఠాలకు నెలవవుతోంది. వరుస సంఘటనలు వరంగల్ నగర వాసులకు వణుకు పుట్టిస్తున్నాయి. డ్రగ్స్ ముఠాలు, గంజాయి మాఫియాగాళ్లు, ఆన్ లైన్ బెట్టింగ్ మాఫియా, దారిదోపిడీలతోపాటు రౌడీయిజానికి వరంగల్ మహా నగరం కేరాఫ్ అడ్రస్ గా మారింది. నగరంలో రోజురోజుకు పెరుగుతున్న క్రైం రేటు తగ్గించేందుకు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నా ఫలితం కనిపించడం లేదు. పోలీసులకే సవాల్ విసిరినట్లు జరుగుతున్న వరుస ఘటనలతో నగర ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఏ క్షణంలో ఎలాంటి వార్తలు వినాల్సి వస్తుందోనన్న భయాందోళనలతో నగర ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు.

### నిన్న విశ్రాంత ఉద్యోగి..

వరంగల్ కేంద్రంలోని కరీమాబాద్ ప్రాంతం శిరంగి రాజా రాం తోటలో నివాసముంటున్న విశ్రాంత ఆర్టీసి ఉద్యోగి రాంచందర్ ను పట్టపగలే గుర్తుతెలియని వ్యక్తులు గొంతు కోసి హత్య చేసిన సంఘటన అండర్ రైల్వే గేట్ ప్రాంతంలో కలకలం రేపింది. ఇంటికి వచ్చిన ఇద్దరు వ్యక్తులు రాంచందర్ తో మాట్లాడుతున్నట్లు నమ్మించి గొంతుకోసి వారు తెచ్చుకున్న బైక్ పైనే పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన సదరు వ్యక్తి కేకలు వేస్తూ బయటికి వచ్చి రోడ్డు మీదే కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు ఆర్టీసీలో కండెక్టర్ గా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. రాంచందర్ కి భార్య, ఒక కుమార్తె, ముగ్గురు కుమారులున్నారు. కూతురికి వివాహం జరిగింది. కుమారులు సాఫ్ట్ వేర్ ఉద్యోగులుగా పని చేస్తున్నారు.

### నేడు రౌడీ షీటర్..

వరంగల్ జిల్లా శివనగర్ ప్రాంతంలో గత తొమ్మిది సంవత్సరాలుగా నివాసముంటున్న రౌడీషీటర్ సయ్యద్ నజీర్ హత్య నగరంలో సంచలనంగా మారింది. మంగళవారం అర్ధరాత్రి దుండగులు రాడ్ తో తలపై బాది కత్తులతో దారుణంగా హత్యచేశారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సయ్యద్ నజీర్ శివనగర్ లోని తన అత్తగారింట్లో ఉంటూ వరంగల్ రైల్వేస్టేషన్ లో స్టాల్ నిర్వహిస్తున్నారు. దినికితోడు ఉత్తరప్రదేశ్ కు చెందిన కొంతమంది యువకులను తన వద్ద వర్కర్లుగా నియమించుకొని వారి ద్వారా రైళ్లలో సమోసాలు, తాగునీటి విక్రయాన్ని నిర్వహించేవాడు. వారికోసం రైల్వేస్టేషన్ కు సమీపంలోనే ఒక గదిని అద్దెకు తీసుకున్నారు. అయితే 15 రోజుల క్రితం శివనగర్ కు చెందిన ఓ వ్యక్తితో ఉత్తరప్రదేశ్ వ్యక్తులు గొడవపడ్డారు. ఈ క్రమంలో రైల్వేస్టేషన్ సమీపంలోని బార్ వద్ద ఘర్షణ జరిగింది. ఈ ఘటనపై మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ లో ఇరువర్గాలకు చెందిన వారు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. ఘర్షణ పడిన ఇద్దరి మధ్య నజీర్ సయోధ్య కుదిర్చాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి ఉత్తరప్రదేశ్ కు చెందిన వారు ఉంటున్న గదికి ఉమేశ్ తో కలిసి నజీర్ వెళ్లాడు. అక్కడే వారి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో వారంతా చుట్టుముట్టి రాడ్డుతో నజీర్ తలపై బాదారు. దీంతో కిందపడిన ఆయనపై విచక్షణారహితంగా కత్తులతో దాడి చేసి హత్య చేశారు. అనంతరం 11 మంది పరారయ్యారు. అయితే యూపీ వాసి వికాస్ మాత్రం తన భార్య గర్భంతో ఉండటంతో వెళ్లకుండా ఉండిపోయాడు. దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. హత్యకు గురైన నజీర్ వెంట ఉన్న ఉమేశ్ పరారీలో ఉన్నాడు. అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఉమేశ్ దొరికితే ఈ హత్యకు గల పూర్తి కారణాలు తెలిసే అవకాశముందని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడు నజీర్ కు భార్య రిజ్వానా బేగం, నలుగురు కుమారైలు ఉన్నారు. నజీర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మిల్స్ కాలనీ సీఐ సురేశ్ కుమార్ తెలిపారు. కాగా నజీర్ గతంలో పాత బీటు బజార్‌లోని గౌడ బార్‌లో మద్యం సేవిస్తున్న ఆటో డ్రైవర్‌ను కత్తితో పొడిచి చంపిన కేసులో అతడిపై పోలీసులు రౌడీ షీట్ ఓపెన్ చేశారు.

### గంజాయి అడ్డాగా..

వరంగల్ గంజాయి మాఫియాకు అడ్డాగా ఉంది. పలుమార్లు ట్రక్కుల కొద్ది గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నా స్మగ్లర్ల తీరు మారడంలేదు. తరచూ ఎక్కడో ఓచోట గంజాయి పట్టుబడుతూనే ఉంది. దీనికి తోడు అంతరాష్ట్ర దొంగలు, బెట్టింగ్ మాఫియాలు రెచ్చిపోతున్నాయి. ధనవంతుల ఇళ్లను టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారు. వరంగల్ నగరం ఉత్తర భారత దేశానికి– దక్షిణ భారత దేశానికి మధ్య వారధిగా ఉండడంతో నేరస్తుల రైలు మార్గాల్లో వచ్చి దోపిడీలకు పాల్పడుతూ సులభంగా పారిపోతున్నారన్న ప్రచారం సాగుతోంది. అయితే, ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు హడావుడి చేస్తున్నారు. ఆ తరువాత షరా మామూలే అన్నట్లు తయారైంది.

### పెరుగుతున్న నేరాలు..

ఇలా దినదినాభివృద్ధి చెందుతున్న వరంగల్ మహానగరంలో నేరాల సంఖ్య కూడా అదేవిధంగా పెరుగుతోంది. మాఫియా ముఠాలు, అంతరాష్ట్ర దోపిడీ గ్యాంగ్ లు నగరంలో రెచ్చిపోతున్నాయి. పోలీసులు పసిగట్టే లోపే రాష్ట్రం విడిచి పారిపోతున్నారు. వరంగల్ అంటేనే వణుకుపుట్టే పరిస్థితి వచ్చింది. పోలీసులు గస్తీ పెంచక పోవటం, సీసీ కెమరాలు ఏర్పాటు చేసినప్పటికీ.. అవి సక్రమంగా పని చేయకపోవడంతో అంతర్ రాష్ట్ర దొంగలు రెచ్చిపోయి పోలీసులకు సవాల్ విసురుతున్నారు. ఇప్పటికైనా నగర ప్రజల భద్రతపై పోలీసులు గట్టి నిఘా పెట్టి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం వుంది.

## కనీస వేతనాలపై సర్వే

**సీఐటీయూ ఆధ్వర్యంలో పాత బీట్ బజార్‌లో నిర్వహణ**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వివిధ దుకాణాల్లో పనిచేస్తున్న కార్మికులు, గుమాస్తాలకు అందుతున్న వేతనాల వేతనాలపై సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం పాత బీటు బజార్ నుంచి బట్టల బజారు వరకు వివిధ షాపుల్లో తిరుగుతూ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి మాట్లాడుతూ వివిధ షాపుల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీరంతా సేల్స్ మెన్స్, హెల్పర్స్, అకౌంటెంట్, మేనేజర్ గా వివిధ హోదాల్లో పనిచేస్తున్నారన్నారు. వీరికి ఈఎస్ ఐ, పీఎఫ్, బోనస్, పని భద్రత, పనిగంటలు, కనీస వేతనాలు అమలు కావడంలేదని సర్వేలో వెల్లడైందన్నారు. షాపులో పనిచేస్తున్న గుమస్తాలు, కార్మికులు గత 30 సంవత్సరాలుగా పనిచేస్తున్న కనీసం గుర్తింపు కార్డులు లేవన్నారు. అతని కిచ్చే వేతనము రూ.15వేలకు మించడంలేదన్నారు. అతి తక్కువ వేతనం రూ.6,000 తీసుకొని వెట్టి చాకిరీ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గున్నాల ప్రభాకర్, ఎం.ఉపేందర్, సాజియా, యాకుపాషా, దివ్య, సరిత, సౌమాశ్రీ పాల్గొన్నారు.

## ల్యాండ్రోమార్ట్ పనుల్లో వేగం పెంచండి

**కలెక్టర్ సిక్తా పట్నాయక్, కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అభివృద్ధి పనుల్లో వేగం పెంచి నిర్దేశిత గడువుల్లోగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాతో కలిసి గ్రేటర్ వరంగల్ లోని 11వ డివిజన్ పోతన నగర్ లో స్మార్ట్ సిటీ పథకంలో భాగంగా కొనసాగుతున్న ల్యాండ్రోమార్ట్, సెకండరీ ట్రాన్సుర్ స్టేషన్ పనుల పురోగతిని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి సమర్థవంతంగా పూర్తి చేయుటకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్మార్ట్ సిటీ పథకం కింద రూ.3 కోట్లతో ఏర్పాటు చేస్తున్న లాండ్రోమార్ట్ పనుల్లో మిషనరీ ఇన్స్టాలేషన్, సివిల్ వర్క్ పూర్తయ్యాయని, ఎలక్ట్రికల్ ఇంకను మిగిలి ఉన్న ఫర్నీషింగ్ పనులు త్వరితంగా పూర్తి చేయాలన్నారు. రూ. 2 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న సెకండరీ ట్రాన్సుర్ స్టేషన్ పనుల్లో సివిల్ వర్క్ పూర్తయిందని, వెంటనే యంత్రాలను బిగించాలని, ట్రాన్స్ పోర్టేషన్ కు వెనుక భాగంలో ఉన్న నాలాకు రిటైనింగ్ వాల్ ఏర్పాటు చేయాలని, ఇరువైపులా మొక్కలతో సుందరీకరణ చేపట్టాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర, సీఎం హెచ్ ఓ డాక్టర్ రాజేష్, ఈఈలు రాజయ్య, సంజయ్ కుమార్, స్మార్ట్ సిటీ పీఎంఈ ఆనంద్ ఓలేటి, అసిస్టెంట్ ఇంజనీర్, గుత్తేదారు తదితరులు పాల్గొన్నారు.

## ఐదు అడుగుల రాఖీ

**రేపు ఎమ్మెల్యే నరేందర్‌కు బహూకరణ**




**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** నగరంలోని 42వ డివిజన్ రంగసాయిపేటకు చెందిన స్థానిక కళాకారుడు, తెలంగాణ ఉద్యమకారుడు పరికి పండ్ల ఈశ్వరయ్య రక్షాబంధన్ సందర్భంగా ఐదు అడుగుల రాఖీని తయారు చేశారు. గత వారం రోజులుగా కుటుంబ సభ్యులతో కలిసి ఈ రాఖీకి తుదిమెరుగులు దిద్దారు. రక్షాబంధన్ సందర్భంగా గురువారం ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ను 42 డివిజన్ బీఆర్ ఎస్ కార్యకర్తలతో కలిసి బహూకరించనున్నట్లు ఈశ్వరయ్య ప్రకటించారు.

## మృతుడికి ఘన నివాళి



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన ధార నారాయణ అల్లుడు వంగరి శ్రీధర్ అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకొని వారి పార్థివ దేహానికి పూలా మాల వేసి నివాళులు అర్పించిన బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు, వంగరి పరపతి సంఘం గౌరవాధ్యక్షులు వంగరి సూర్యనారాయణ, అధ్యక్షులు వంగరి జయప్రకాష్, సహాయ కార్యదర్శి వేణుగోపాల్, సభ్యులు కోటేశ్వర్, అశోక్, శ్రీనివాసులు, యుగంధర్, రమేష్, వరంగల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు రత్నం కృష్ణ కిషోర్, ఓబీసీ మోర్చా తూర్పు కోఆర్డినేటర్ కోమకులా నాగరాజు, నాయకులు కుడికాల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర హ్యాండ్ బాల్ కోచ్ గా విష్ణువర్ధన్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ హ్యాండ్ బాల్ పురుషుల జట్టు కోచ్ గా విష్ణువర్ధన్ ను నియమిస్తూ శాట్ డిప్యూటీ డైరెక్టర్ ధనలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. జమ్మూ కాశ్మీర్ లో సెప్టెంబర్ ఒకటి నుంచి ఏడో తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్ బాల్ పోటీలకు హనుమకొండ హ్యాండ్ బాల్ అకాడమీ కోచ్ గా విష్ణువర్ధన్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ ను హ్యాండ్ బాల్ అసోసియేషన్ తెలంగాణ అధ్యక్షుడు జగన్ మోహన్ రావు, శాట్ అసిస్టెంట్ డిప్యూటీ డైరెక్టర్ అశోక్, హనుమకొండ క్రీడాభివృద్ధి అధికారి అశోక్ కుమార్, హనుమకొండ ఇంచార్జ్ డీవైఎస్ఓ అనిల్, వరంగల్ ఉమ్మడి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు అజీజ్ ఖాన్, కైలాస్ యాదవ్, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు, కోచులు బుధవారం అభినందించారు.

# అభివృద్ధి పనుల పరిశీలన

**వరంగల్ వాయిస్, పరకాల :** నియోజకవర్గంలోని గొర్రెకుంట గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, కమిషనర్ రిజ్వాన్ బాషా కలిసి పురోగతిలో ఉన్న అభివృద్ధి పనులు పరిశీలించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్ పరిధిలోని గొర్రెకుంట గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వారు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అదేవిధంగా గ్రామంలో రోడ్డు విస్తరణలో ఇండ్లు కోల్పోతున్న కుటుంబాలను కలిసి మాట్లాడారు. రోడ్డు వెడల్పులో ఇండ్లు కోల్పోతున్న వారందరికీ ప్రభుత్వం అందించే డబుల్ బెడ్రూమ్ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇంకా ఎవరైనా ఉన్న వారికి కూడా ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బల్దియా అధికారులు, రెవెన్యూ అధికారులు, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంట నష్ట పరిహారం చెక్కుల అందజేత..

సంగెం మండలం పల్లారుగూడ గ్రామంలో బుధవారం స్థానిక శాసనసభ్యుడు చల్లా ధర్మారెడ్డి పర్యటించారు. పలు కాలనీలలో కాలినడకన తిరుగుతూ స్థానిక ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రూ.85లక్షలతో నూతనంగా వేసిన సీసీ రోడ్లు ప్రారంభించారు. అనంతరం గ్రామంలో





ఏర్పాటుచేసిన సమావేశంలో అకాల వర్షాలకు పల్లారుగూడ, వీఆర్ఎన్ తండా, వంజరపల్లి, పోచమ్మతండ గ్రామాలలో పంటనష్టపోయిన 1264మంది రైతులకు గాను రూ.1కోటి 7లక్షల 4వేల రూపాయల విలువ చేసే నష్టపరిహారం చెక్కులు రైతులకు ఎమ్మెల్యే అందజేశారు. అలాగే సంగెం మండలం గొల్లపల్లి గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సంగెం మండలం మొండ్రాయి, ముమ్మడివరం, గొల్లపల్లి గ్రామాలలో అకాల వర్షాలకు పంటనష్టపోయిన 1099మంది రైతులకు గాను రూ.99లక్షల 2వేల విలువచేసే నష్టపరిహారం చెక్కులు అందించారు. నార్లవాయి గ్రామంలో అకాల వర్షాలకు పంట నష్టపోయిన నార్లవాయి, నల్లబెల్లి గ్రామాలకు చెందిన 223మంది రైతులకు గాను రూ.24లక్షల 84వేల విలువైన పంటనష్టపరిహారం చెక్కులు స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సొసైటీ, మార్కెట్ చైర్మన్లు, కమిటీ సభ్యులు, రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పోలీసుల అక్రమ అరెస్టు లను తీవ్రంగా ఖండిస్తున్నామని పాలకుర్తి హుజన సమాజ్ పారీ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి ఇదునూరి ప్రసాద్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి బహుజన బిడ్డ అయిన బీసీ యాదవ కుటుంబానికి చెందిన వట్టే జానయ్య యాదవ్ పై అక్రమ కేసులు పెడుతూ ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. జానయ్యకు మద్దతుగా బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పిలుపు మేరకు చలో సూర్యాపేటకు బయలుదేరుతున్న పాలకుర్తి నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి ఈదునూరి ప్రసాద్, తొర్రూర్ మండల కోశాధికారి డొనుక ఐలయ్యను ముందస్తు అరెస్టు చేయడం హేయమైన చర్య అని వారు అంటున్నారు.

# ఎమ్మెల్యే శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** మండలంలోని సూరారం ఎస్సీ కాలనీలోని ఆంజనేయ స్వామి గుడి కమ్యూనిటీ హాల్‌కు రూ.5 లక్షలు సీడీపీ నిధుల ద్వారా మంజూరు చేసిన ఎమ్మెల్యే శ్రీధర్ బాబుకు కాలనీ ఆంజనేయ ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీధర్ బాబు ఇక ముందు కూడా ఆలయ అభివృద్ధికి సహకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బందెల కిష్టయ్య, గోల్కొండ రాజయ్య, కొయ్యల మల్లయ్య, దుర్గం బాలమల్లు, లేళ్ల చంద్రయ్య, కొత్తురి లచ్చయ్య, లేళ్ల అంకయ్య, జంగ సమ్మయ్య, లేళ్ల సాంబమూర్తి, కొత్తూరి సంపత్ , లేళ్ల సమ్మయ్య, పనగంటి వెంకటస్వామి, కొయ్యల శ్రీను, కొత్తూరి సతీశ్, ముల్కల అనిల్, చెన్నూరి మధు పాల్గొన్నారు.

# నిత్యావసర సరుకుల పంపిణీ



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణానికి చెందిన బొనగాని హాసిని-లక్ష్మణ్ దంపతుల కుమారుడు ఆరవ్ పుట్టినరోజు సందర్భంగా యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో రైస్ బ్యాగ్ చాలెంజ్ 30 కార్యక్రమంలో భాగంగా వరంగల్ ఆటోనగర్ లో ఉన్న లూయిస్ ఆదర్శ బ్లైండ్ స్కూల్ లో 25కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు, అరటి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షుడు కొత్తకొండ అరుణ్ కుమార్, వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు), కానిస్టేబుల్ బొట్టు కమలాకర్, కోలా రాజేష్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్, పెరుమాండ్ల తేజ, గైని రాజ్ కుమార్, ఎస్ కే ముస్తఫా, భావన, జ్యోతి, అలువాల పృథ్వీ, ఉప్పరపల్లి రాజ్ కుమార్, మునిగాల రాంప్రసాద్, బిటుకూరి యాకయ్య, సృజన, పాలకుర్తి విష్ణు, లీగల్ అడ్వైజర్ రాచకట్ల కృష్ణ (హైకోర్ట్ అడ్వకేట్), చెలిమల్ల అశోక్ కుమార్, ఊరటి రవికుమార్, తూనం రాము, సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ వైనాల రమేష్, మోడెం రాజశేఖర్ గౌడ్, నాగవెల్లి కార్తీక్ పాల్గొన్నారు.

# మహీంద్రా ట్రాక్టర్ ప్రారంభించిన సర్పంచ్



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** మండల కేంద్రంలో ఆదర్శ గ్రూప్ వారి మహీంద్రా ట్రాక్టర్ ప్రచార కార్యక్రమంలో భాగంగా నోవో 605డీఐ ట్రాక్టర్ ను సర్పంచ్ శ్రీపతిబాపు ప్రారంభించారు. సెల్ఫ్ డ్రైవ్ చేస్తూ ట్రాక్టర్ లోని ప్రత్యేకతలు స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం జరిగిన రైతు అవగాహన సభలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సెన్సార్ ఉపయోగించడంతో పాటు, రైతు వ్యవసాయ పనులకు అన్ని విధాలా సహాయపడుతుందని సర్పంచ్ శ్రీపతిబాపు అన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి మహీంద్రా ఇంజిన్ తో నడిచే అనేక వాహనాలు ఉన్నాయని, ట్రాక్టర్ అమ్మకాల్లోనూ మహీంద్రా పోటీ పడుతుందని అన్నారు. ఆంధ్ర వాళ్లు వచ్చినప్పటి నుంచి ఈ ప్రాంతంలో రైతులు ఫర్గ్యూజన్ ట్రాక్టర్లు మాత్రమే వాడుకలో ఉన్నాయని, ఇక్కడి వ్యవసాయానికి ఉపయోగపడేలా మహీంద్రా ట్రాక్టర్లు ఉన్నట్లైతే ఇక్కడి రైతులు కూడా కొనుగోలుకు ముందుకు రావచ్చని, రైతుల ఫీడ్ బ్యాక్ కు అనుగుణంగా ట్రాక్టర్ మోడల్స్ మార్కెట్ లో పోటీ పడగలిగితే మహీంద్రా కంపెనీ ట్రాక్టర్ల కూడా గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ ఉంటుందని పేర్కొన్నారు.

# బాల వికాస సంస్థ సేవలు గొప్పవి




**వరంగల్ వాయిస్, తొర్రూరు :** సామాజిక సేవా దృక్పథంతో గ్రామంలో బాలవికాస సంస్థ అందిస్తున్న సేవలు చాలా గొప్పవని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గుర్తూరు గ్రామ సర్పంచ్ మోత్కూరి రవీంద్ర చారి అన్నారు. తొర్రూరు డివిజన్ గుర్తూరు గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహ ఆస్పత్రి డా.నిఖిత, డా.స్వరాజ్యం ఆధ్వర్యంలో గ్రామంలోన బుధవారం ఉచితంగా స్త్రీలకు వైద్య పరీక్షలు నిర్వహించి తర్వాత మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ బాలవికాస స్వచ్ఛంద సంస్థ, ఎన్నో సంస్థలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తేనే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. మందుల ధాత సుభాష్, బాలవికాస సంస్థ కోఆర్డినేటర్ మద్దెల రమ, కోఆర్డిటర్లు శైలజ, శోభ, సరిత, కారోబార్ తల్లాడి వేణు, కార్యదర్శి నరేష్ ,తదితర నాయకులు, ప్రజలు పాల్గొన్నారు

# ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ

## భూమిని విరాళంగా అందజేసిన ఇనగాల

**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** మండలంలోని గుడెప్పాడు గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఇనగాల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా భూమిని పరకాల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఇనగాల వెంకట్రామ్ రెడ్డి కేటాయించడంతో పాటు బుధవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇనగాల మాట్లాడుతూ గ్రామంలో దళితులు తమ కుటుంబ సభ్యుల బంధుమిత్రులతో ఏదైనా శుభకార్యములు నిర్వహించుకునే విధంగా ఈ హాలు నిర్మాణం జరిగేలా తాను చూస్తానని, ఇందుకు అవసరమైన నిధులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. చేవెళ్లలో జరిగిన ప్రజా గర్జన సభలో పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఎస్సీ, ఎస్టీలకు తప్పకుండా పెద్ద పీట వేసి అమలు చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన దళిత నాయకులు ఇనగాలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఆత్మకూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కమలాపురం రమేష్, పరకాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, గూడెప్పాడు ఎంపీటీసీ బీరం రజినీకర్



రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ జనగాం ప్రభాకర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి మహిపాల్ రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి కొడేపాక కుమారస్వామి, మండల ఉపాధ్యక్షుడు చిదిరాల శ్రీనివాస్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు కందికొండ రఘుపతి, విద్యా కమిటీ చైర్మన్ బొటికే నాగరాజు, దామెర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మన్నెం ప్రకాష్ రెడ్డి, దామెర మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పొలపాక శ్రీనివాస్, వార్డు మెంబర్ కరుణాకర్ రెడ్డి, మండల నాయకులు లక్కర్స్ జగన్, తదితరులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డలకు రాఖీ కానుకగా గ్యాస్ ధరల తగ్గింపు

## మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి



**వరంగల్ వాయిస్, పరకాల :** కుటుంబంలో ఆనందాన్ని పంచే పండుగ రక్షాబంధన్ సందర్భంగా ఆడబిడ్డలకు ఎల్పీజీ సిలిండర్ ధర 200తగ్గింపు, ఉజ్వల గ్యాస్ కనెక్షన్ 400తగ్గించడంతో పరకాల పట్టణంలోని బస్టాండ్ కూడలి వద్ద పరకాల పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, పరకాల బీజేపీ కాంటెస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్. పెసరు విజయచందర్ రెడ్డి పాల్గొన్నారు. పాలాభిషేకం అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడబిడ్డలకు రక్షాబంధన్ కానుకగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గ్యాస్ ధరలు తగ్గించి సోదరీమణులకు ముఖంలో సంతోషం చూశారు. రాష్ట్రంలో కేసీఆర్ రైతులకు ప్రజలకు ఏమాత్రం సంక్షేమ పథకాలు చేపట్టడం లేదని, ప్రధాని నరేంద్ర మోడీ రైతుల కోసం ఫసల్ బీమా యోజన పథకాన్ని ప్రవేశపెడితే దాన్ని పక్కనపెట్టి తీవ్రంగా నష్టపోయిన రైతులకు ఎన్నికల ముందు పదివేల రూపాయలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఫసల్ బీమా అమలు చేస్తే రైతులకు నష్టపరిహారం భారీగా అందేదని అన్నారు. ప్రజలకు ఆరోగ్యశ్రీ కార్డు కొన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నారని, అదే నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ ప్రవేశపెడితే ప్రతి ఒక్కరికి ఐదు లక్షల ఆరోగ్య సేవలకు సహాయం అందుతుందని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలను మభ్య పెట్టేందుకు రకరకాల స్కీములు చూపెడుతున్నాడని కానీ ఏ ఒక్కటి కూడా ప్రజలకు అందే విధంగా చేయట్లేదని అన్నారు. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నమ్మట్లేదని, కేసీఆర్ చేసే మోసాలను ప్రజలందరికీ తెలిపి రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ను గద్దె దించి బీజేపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. డాక్టర్ విజయ చందర్ రెడ్డి మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలను ప్రధానమంత్రి ఉజ్జ్వల యోజన లబ్ధిదారులకు రూ.400 సబ్సిడీ అందించడం పేదల పట్ల బీజేపీ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి గాజుల నిరంజన్, కుక్కల విజయ్, పరకాల పట్టణం ఇంఛార్జి మేకల రాజువీరు, జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్ గౌడ్, పరకాల రూరల్ అధ్యక్షులు పుట్టా రవీందర్, నడికూడ మండల అధ్యక్షులు గోగుల రాజిరెడ్డి, నడికూడ మండల ప్రధాన కార్యదర్శి దండు సురేష్, ఆత్మకూరు మండలఅధ్యక్షుడు సదానందం, సంఘ పురుషోత్తం, ఆకుల రాంబాబు, దండు సురేష్, దంచనాల సత్యనారాయణ, కాసగాని రాజ్ కుమార్, యువ మోర్చా పట్టణ అధ్యక్షుడు కొలనుపాక రేవంత్ సిద్ధు, శ్రవణ్ కుమార్, పైడాచారి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఇనగాల వెంకట్రామ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని కంఠాత్మకూర్ గ్రామానికి చెందిన రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వీరాటి తిరుపతి రెడ్డి –రజిత దంపతుల పుత్రిక సౌమ్య–దినేష్ వివాహానికి ఎర్రగట్టు గుట్ట బాలాజీ గార్డెన్ లో జరగగా పరకాల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఇనగాల వెంకట్రామ్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. నర్సంపేట మాజీ శాసన సభ్యుడు దొంతి మాధవరెడ్డి, వర్ధన్నపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు కె.నాగరాజు, పీసీసీ కోఆర్డినేటర్ బొమ్మనపల్లి అశోక్ రెడ్డి, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్ రెడ్డి, జిల్లా నాయకులు చాడ కొమురా రెడ్డి, కొండేటి కొమురా రెడ్డి, ఆత్మకూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కమలాపురం రమేష్, పరకాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, గుడెప్పాడు ఎంపీటీసీ బీరం రజినీకార్ రెడ్డి, దామెర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మన్నెం ప్రకాష్ రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి 2వ విడత కౌన్సెలింగ్ నోటిఫికేషన్ విడుదల

## వచ్చే నెల 1 వరకు వెబ్ కౌన్సెలింగ్

## కాళోజి హెల్త్ యూనివర్సిటీ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రభుత్వ ప్రైవేటు వైద్య కళాశాలల్లో కన్వీనర్ కోటా ఎంబీబీఎస్ ప్రవేశాలకు రెండవ విడత కౌన్సిలింగ్ నోటిఫికేషన్ ను కాళోజి వైద్య ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసింది. మొదటి విడత అనంతరం ఖాళీగా ఉన్న సీట్లను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నారు. కళాశాల వారీగా సీట్ల ఖాళీల వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సెప్టెంబర్1 మధ్యాహ్నం 1గంట వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చని, పూర్తి వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్ సైట్ www.knruhs.telangana.gov.inలో చూడవచ్చని యూనివర్సిటీ వర్గాలు బుధవారం ప్రకటనలో తెలిపాయి.

# ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** బీజేపీ పరకాల నియోజకవర్ లోని ఆత్మకూర్ బస్టాండ్ సెంటర్ లో ఆత్మకూరు బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పరకాల కాంటెస్టెడ్ ఎమ్మెల్యే పెసర విజయ చందర్ రెడ్డి మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.200 తగ్గించాలని గొప్ప నిర్ణయం తీసుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఇది దేశవ్యాప్తంగా ఉన్న అక్కచెల్లెలందరికీ మోదీ రక్షా బంధన్ కానుక అన్నారు. ప్రధానమంత్రి ఉజ్జ్వల యోజన లబ్ధిదారులకు రూ.400 సబ్సిడీ అందించడం పేదల పట్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. పేద ప్రజలకు ఉపయోగపడే కేంద్ర ప్రభుత్వ పథకాలు పంట బీమా పథకం మరియు ఆయుష్మాన్ భారత్ పథకం ఈ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా బడా కాంట్రాక్టర్లకు కొమ్ముకాస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఉప్పుగల్ల శ్రీకాంత్ రెడ్డి, ఆర్ టీఐ జిల్లా కన్వీనర్ ఎదులాపురం శ్రవణ్ కుమార్, కిసాన్ మోర్చా నియోజకవర్గ కన్వీనర్ వంగాల బుచ్చిరెడ్డి, మండలం ఉపాధ్యక్షుడు గట్టు వేణు, మండల కార్యదర్శి భయ్యా పైడి, మండల కోశాధికారి కోరుకొప్పుల నాగరాజు, భయ్యా మాలగం, కోరుకొప్పుల రమేష్, వరికేల రామకృష్ణ, భయ్యా సాంబయ్య ,సారంగం, తదితరులు పాల్గొన్నారు.

# బిట్స్ స్కూల్‌లో రాఖీ పౌర్ణమి వేడుకలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** బిట్స్ విద్యాసంస్థల వారి బిట్స్ స్కూల్ లో ఘనంగా రాఖీ పౌర్ణమి పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా సంస్థ చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాఖీ పండుగ విశేషాన్ని గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సంతోష్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్యాస్ ధర తగ్గింపుపై హర్షం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** దేశ వ్యాప్తంగా రక్షాబంధన్ పండుగ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ వంట గ్యాస్ ధరను రూ.200 తగ్గించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ తొర్రూరు లో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ప్రధాని మోడీ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా తొర్రూరు అర్బన్ మండలం అధ్యక్షురాలు పల్లె రజిత మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ రక్షాబంధన్ పండుగ కానుకగా గ్యాస్ ధరను తగ్గించారని,పేద ప్రజలకు ఎంతో ఉపశమనం కలిగించే నిర్ణయం ప్రధాని మోడీ తీసుకున్నారని తెలిపారు. పదికోట్ల మంది ఉజ్వల యోజన లబ్దిదారులకు రూ.400 మేరకు గ్యాస్ ధరను తగ్గించడం హర్షణీయమని అన్నారు. 33కోట్ల మంది పేద, మధ్య తరగతి కుటుంబాలకు రూ.10 కోట్ల మంది ఉజ్వల యోజన లబ్దిదారులకు తీవ్ర ఆర్థిక భారం తగ్గించే విధంగా ప్రధాని నరేంద్ర మోడీ గాఈ నిర్ణయం తీసుకోవడం మహిళా లోకానికి రాఖీ పండుగ శుభ కానుక ఇచ్చినందుకు వారికి మహిళా లోకం తరుపున ధన్యవాదాలు తెలిపారు. మహిళలంతా ప్రధాని నరేంద్ర మోడీ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ వారికి ఎల్లవేళలా అండగా ఉండి వారు మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టేందుకు తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ, సరస్వతి, నాగలక్ష్మి, కీర్తి, యమున, రజియా, వరలక్ష్మి, ఉమ, యశోద, మంజుల, రామతార, తదితరులు పాల్గొన్నారు.

# దళిత బంధు నిరంతర ప్రక్రియ



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** దళిత బంధు గురించి మండలంలోని దళితులు ఆందోళన చెందవద్దు. దళిత బంధు కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని రైతుబంధు మండల కోఆర్డినేటర్ మ్యాకల లాజరస్ గట్ల నర్సింగాపూర్ బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బొల్లంపల్లి సుకుమార్ పత్రిక సమావేశంలో తెలియజేశారు. ఇది ఆన్ లైన్ లో చేసుకునేది కాదని, ఆఫ్ లైన్ లోనే దరఖాస్తు చేసుకోవాలని, ఈ దరఖాస్తు చేసుకోవడానికి మూడు రోజులని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇది నిరంతర ప్రక్రియ కాబట్టి, ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

# దళితుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



**వరంగల్ వాయిస్, మరిపెడ :** దళితుల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ అరుణ రాంబాబు, జడ్పీటీసీ శారదా రవీందర్ లు అన్నారు. మరిపెడ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మరిపెడ ఎంపీపీ గుగులోతు అరుణ రాంబాబు, జడ్పీటీసీ శారద రవీందర్ తో కలిసి మరిపెడ మండలం రాంపురం గ్రామానికి చెందిన బందు శోభకు ఎస్సీ కార్పొరేషన్ (2018–19)నుంచి మంజూరైన రూ.35,000 చెక్కును బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ధన్సింగ్, సూపరిండెండెంట్ శేశషయనం, ఎంపీటీసి సభ్యులు రంజిత, సర్పంచ్ బిక్కు రవి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి సన్మానం



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల మున్సిపాలిటీ రూమ్స్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ వచ్చినందుకు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి మూడోసారి గెలిచి మంత్రి పదవి పొందాలని శాలువా, బొకేతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో దుప్పటి సాంబశివుడు, పల్లవి రమేష్, వాసవి సుధాకర్, ఎండీ ఖాజా, ఎండీ సలీం, ఎండీ ఆలీ, సూర నర్సయ్య, నారగని రమేష్, మాదసి రామ్మూర్తి, అకుల రాంబాబు, బండి భారత్, సుంకరి సత్యం తదితరులు పాల్గొన్నారు.

# మర్రి జనార్దన్ రెడ్డివి అనుచిత వ్యాఖ్యలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేన రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రేపల్లె రంగనాథ్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి బీఆర్ఎస్ సభలో కాంగ్రెస్ వాళ్లు కనిపిస్తే గన్నులతో పేల్చేస్తామని చేసిన అనుచిత వాఖ్యలను ఖండిస్తూ యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందికట్ల అనిల్ ఆధ్వర్యంలో పర్వతగిరి పోలీస్ స్టేషన్ లో ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి పై పర్వతగిరి ఎస్సై వీరభద్రరావుకు ఫిర్యాదు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ పర్వతగిరి మండల ఉపాధ్యక్షుడు నీరటి ప్రశాంత్, పంతంగి దేవేందర్, యూత్ కాంగ్రెస్ నాయకులు రంజిత్ ప్రభాకర్, కుమార్, అఖిల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చీకటి శ్రీధర్ పాల్గొన్నారు.

# న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** విద్యా శాఖలో సర్వశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట గత ముడు రోజులుగా సమ్మె కొనసాగిస్తున్నారు. ఈ సమ్మెకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యాప సీతయ్య సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తెలంగాణ రాష్టం ఏర్పడితే కాంట్రాక్టు వ్యవస్థ ఉండదని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారం కోసం సాధ్యం కానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్నారని, సర్వ శిక్ష అభియాన్ లో పని చేస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## టీపీయూఎస్ మద్దతు..

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లాలో సమగ్ర శిక్షా (ఎస్ఎస్ఏ) ఒప్పంద ఉద్యోగ, ఉపాధ్యాయుల రిలే నిరాహారదీక్షకు సంపూర్ణ మద్దతు టీపీయూఎస్ జిల్లా మానుకోట శాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిబోయిన గోపికృష్ణ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగ ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రతను కల్పిస్తూ వారికి వెంటనే మినిమం టైం స్కేల్ ను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగ, ఉపాధ్యాయులు, సిబ్బందికి న్యాయం జరిగే వరకు ప్రత్యక్షంగా, పరోక్షంగా పోరాటం చేస్తానని భరోసా కల్పించారు. తపస్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయ ఉద్యమ జాగరణలో భాగంగా వారి సమస్యల పరిష్కారం కోసం కూడా పోరాటం చేస్తున్నామని తెలియచేశారు.

# నవోదయ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలోని నవోదయ హై స్కూల్ లో విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై దేవేందర్ సదస్సులో విద్యార్థులకు డయల్ 100, షీ టీమ్స్, సైబర్ క్రైమ్స్ 1930, ఐటీ కేసెస్, సీసీ కెమెరాస్, ట్రాఫిక్ వాయిలేషన్స్, సూసైడల్ డెత్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పృథ్వీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# చాంప్ల తండా రాష్టానికే ఆదర్శ గ్రామంగా నిలవాలి

## కలెక్టర్ కె.శశాంక



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మండలంలోని చాంప్లతండా గ్రామ పంచాయతీ అన్ని రంగాలలో అభివృద్ధి చెంది తెలంగాణ రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలని జిల్లా కలెక్టర్ శశాంక కోరారు. బుధవారం మహబుబాబాద్ కలెక్టర్ శశాంక డోర్నకల్ మండల చాంప్ల తండా గ్రామ పంచాయతీ సందర్శించి అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి గ్రామ అభివృద్ధిని పరిశీలించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన గోబర్ గ్యాస్ ప్లాంట్ ను పరిశీలించిన ఆయన అదనంగా ఉత్పత్తి చేస్తున్న గోబర్ గ్యాస్ ను విక్రయించేందుకు ప్రణాళిక రూపొందించుకోని ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. అభివృద్ధి పథంలో కొనసాగుతున్న గ్రామస్తులను కలెక్టర్ ప్రశంసించి ఇదే స్ఫూర్తితో మరిన్ని వినూత్న అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పరిసర గ్రామాలకు ఆదర్శంగా నిలువాలని గ్రామస్తులను సూచించారు. బాలవికాస ద్వారా నిర్మించిన వాటర్ ప్లాంట్, గ్రంథాలయాన్ని కలెక్టర్ సందర్శించి నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయం ఏర్పాటుకు దాతలు సహకారం ఉందన్నారు. గ్రంథాలయానికి ఫర్నిచర్ తెప్పించి బిల్ పంపించాలని అధికారులను ఆదేశించారు. స్టడీ మెటీరియల్ తెప్పించాలని, ఫ్యాన్స్ ఏర్పాటు చేయాలని డీఆర్డీఏ పీడీని ఆదేశించారు. నిర్వహణ బాధ్యతలు తీసుకోవాలని, సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయాలన్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుతో ఆదాయం లభిస్తున్నదని, గ్రామంలో పది రూపాయలకే 20లీటర్ల క్యాన్ అందిస్తున్నామని గ్రామ కార్యదర్శి సంపత్ వివరించారు. మరిపెడలోని సిమ్ కార్డు టెక్నాలజీ ఉపయోగిస్తూ త్రాగునీటిని విక్రయించడం స్వయంగా పరిశీలించామని, అదే టెక్నాలజీ వినియోగిస్తూ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం నిర్వహణ భారం కొంత తగ్గిందని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించి పనితీరులో పారదర్శకత పాటిస్తూ జవాబుదారీ తనంతో బాధ్యతలు నిర్వహిస్తున్న సర్పంచు పాండు నాయక్, పంచాయితీ సెక్రటరీ సంపత్ని కలెక్టర్ శాలువాలతో సన్మానించారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి గ్రామంలో ఏడు అంగన్వాడి సెంటర్ లు ఉన్నాయని సర్పంచ్ వివరించగా వాటిని మూడు అంగన్వాడీ కేంద్రాలుగా చేయాలని, భవనాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఇంకుడు గుంతలకు బిల్లులు రాలేదని ప్రజలు చేసిన విజ్ఞప్తికి స్పందిస్తూ కలెక్టర్ తక్షణం విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. క్రీడలపై కలెక్టర్ మాట్లాడుతూ వాలీబాల్ క్రీడలకు అవకాశం ఉన్నదని గ్రామస్తులు చెప్పడంతో బాస్కెట్ బాలు కోర్టుకు కూడా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్డీఏ పీడీ సన్యాసయ్య, జిల్లా పంచాయతీ అధికారి నర్మద, ఎంపీడీవో చలపతిరావు తహసీల్దార్ నాగ భవాని, ఉప సర్పంచ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సూర్యాపేట మంత్రి జగదీశ్ రెడ్డి వట్టే జానయ్య యాదవ్ ను అక్రమంగా అరెస్టు చేయించి అతని కుటుంబ సభ్యుల మీద దాడి చేయించినందుకు గాను బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చలో సూర్యాపేట పిలుపునివ్వగా మద్దతుగా నిలవడానికి వెళ్తున్న బహుజన్ సమాజ్ పార్టీ నాయకులను అరెస్టు చేసినందుకు నిరసనగా హనుమకొండ అశోక సెంటర్ లో బహుజన్ సమాజ్ పార్టీ హన్మకొండ జిల్లా కమిటీ, స్వేరో స్టూడెంట్స్ విద్యార్థి నాయకులు ఆధ్వర్యంలో మంత్రి జగదీష్ రెడ్డి చిత్రపటాలను తగలబెట్టి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజు మాట్లాడుతూ అక్రమ అరెస్టుల తో మంత్రి జగదీష్ రెడ్డి కుంభకోణాలను అక్రమ దందాలను బీఆర్ఎస్ దందాలను , ప్రజలకు కేసీఆర్ చేసిన మోసాలను ప్రజలు పసిగట్టి రానున్న రోజుల్లో కేసీఆర్ ను ఫామ్ హౌస్ కు పరిమితం చేయడంలో ఎవరు ఆపలేరని అన్నారు. వెంటనే వట్టె జానయ్య యాదవ్ ను విడుదల చేసి తన కుటుంబ సభ్యులకు అప్పగించాలని, అలాగే అరెస్టు చేసిన బీఎస్పీ నాయకులను వెంటనే విడుదల చేయాలని శనిగరపు రాజు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఒంటేరు చక్రీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ మంజుల మనీ, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జి ఎండీ మినాజ్, పశ్చిమ అధ్యక్షుడు బొట్ల నితిన్, పరకాల నియోజకవర్గ ఇంచార్జి అమ్మ సాంబయ్య, స్వేరో స్టూడెంట్స్ యూనియన్ జిల్లా నాయకులు మారేపల్లి మనోజ్, గుర్రం శుశ్రుత్, కన్నూరి నాగరాజు, బీఎస్పీ నాయకులు, స్వేరో స్టూడెంట్స్ యూనియన్ నాయకులు పాల్గొని నిరసన తెలిపారు.

# బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం

## కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** బీఆర్ఎస్ పాలనలో శాయంపేట మండలం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇంచార్జి గండ్ర సత్యనారాయణ రావు ఆదేశం మేరకు శాయంపేట మండల పార్టీ ఆధ్వర్యంలో గత నెలలో కురిసిన భారీ వర్షాలకు మండలంలో దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. అనంతరం శాయంపేట మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసమే అధికార బీఆర్ఎస్ లో చేరుతున్నానని చెప్పి నాలుగు సంవత్సరాలు గడిచిన శాయంపేట మండలం మాత్రం ఎలాంటి అభివృద్ధికి నోచుకోకపోవడం సిగ్గుచేటని, తెలంగాణ రాష్ట్రంలో నేషనల్ హైవేకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏ మండల కేంద్రమైన అభివృద్ధి చెందిందని, కానీ శాయంపేట మండల కేంద్రంలో అభివృద్ధి జరగకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రతిపక్షాల ఒత్తిడితో కేంద్ర ప్రభుత్వ నిధులతో అసంపూర్తిగా డబుల్ రోడ్డు నిర్మాణం చేసిన ఎమ్మెల్యే మురుగు నీరు పోవడానికి సైడ్ కాలువ నిర్మాణం చేపట్టకపోవడం మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయకపోవడం ఆయన అసమర్థ పాలనకు నిదర్శమన్నారు. ఆత్మకూరు నుంచి శాయంపేట వరకు రోడ్డు నిర్మాణంలో ఇల్లు కోల్పోయి నా నిరుపేదలకు ముఖ్యమంత్రితో మాట్లాడి మూడు నెలల్లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయిస్తామని చెప్పి సంవత్సర కాలం గడిచిన ఇచ్చిన హామీని నిలుపుకోకపోవడం సిగ్గుచేటన్నారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని వివిధ గ్రామాలకు పోయే రోడ్లు దెబ్బతిని ప్రజల రాకపోకలకు నానా ఇబ్బందులు కలుగుతున్నా, తాత్కాలికంగా దెబ్బతిన్న రోడ్ల నిర్మాణం ఇప్పటివరకు చేపట్టకపోవడం సరికాదని మండిపడ్డారు. ప్రజలకు గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చని మీరు ఎలక్షన్ల ముందు శంకుస్థాపనలు చేసి ప్రజలను మభ్యపెట్టి రాబోయే ఎలక్షన్లలో లబ్ధి పొందాలనుకోవడం మీ అసమర్థ రాజకీయాలకు నిదర్శనమని దుయ్యబట్టారు. మీరు ఎన్ని జిమ్మిక్కులు చేసినా రాబోయే ఎలక్షన్లలో ప్రజల చేతులో మీకు గుణపాఠం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు మైనాల కుమారస్వామి, నిమ్మల రమేష్, ప్రధాన కార్యదర్శులు చిందం రవి, హైదర్ మారెపల్లి రవీందర్, నరేష్ రెడ్డి, జగన్, లక్ష్మణరావు, మొగిలి, కమలాకర్ పాల్గొన్నారు.

# విద్యాసంస్థలకు కొమ్ముకాస్తున్న అధికారులను సస్పెండ్ చేయాలి

## పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ప్రభుత్వ గుర్తింపు లేకుండా కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ లో శ్రీ చైతన్య పాఠశాలను నిర్వహిస్తున్న యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, పీడీఎస్ యూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా పీడీఎస్ యూ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక బట్టు అంజయ్య స్మారక భవనంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ మాట్లాడుతూ శ్రీ చైతన్య పాఠశాలను నిర్వహిస్తున్న యజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆందోళన నిర్వహించిన పీడీఎస్ యూ విద్యార్థి నాయకుల పై యాజమాన్యం, పోలీసులు కుమ్మక్కై నలుగురిపై మోపిన తప్పుడు కేసులను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ వెంటనే శ్రీ చైతన్య విద్యాసంస్థలకు కొమ్ముకాస్తున్న కరీంనగర్ జిల్లా డీఈవో, హుజూరబాద్ ఎంఈఓలను తక్షణమే సస్పెండ్ చేయాలని, శ్రీ చైతన్య విద్యాసంస్థల పై చర్యలు తీసుకోవాలని అదేవిధంగా పీడీఎస్ యూ విద్యార్థి నాయకులకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలన్నారు. రాష్ట్రంలో శ్రీ చైతన్య విద్యాసంస్థలను తక్షణమే రద్దు చేయాలనీ , శ్రీ చైతన్య విద్యాసంస్థలలో జరుగుతున్న ఫీజుల దోపిడీపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిస్తామని హెచ్చరించారు.

## నేషనల్ నవ క్రాంతి పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ అభ్యర్థిగా లంకసిరి రాజకుమార్



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** నేషనల్ నవ క్రాంతి పార్టీ హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థిగా లంకసిరి రాజ్ కుమార్‌ని నియమిస్తున్నట్లు ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కనకం శ్రీనివాసరావు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 2023లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో మా పార్టీ అభ్యర్థులు బరిలో ఉంటారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల నుంచి యువత నుంచి అధిక స్థానాల్లో అభ్యర్థులుగా నిలబెట్టి వారిని చట్టసభలకు పంపే విధంగా పార్టీ పనిచేస్తుందని తెలిపారు. కొన్ని వెనకబడిన వర్గాల నుంచి ఇంతవరకు చట్ట సభలకు ఎన్నిక కాలేదని, అటువంటి వారిని గుర్తించి వారిని చట్టసభలకు పంపించే బాధ్యత మా పార్టీ తీసుకుందన్నారు.

## టై, బెల్ట్, ఐడీ కార్డుల పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రంగశాయిపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయుడు ఉటుకూరి అశోక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్థానిక 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి స్థానిక పెద్దలు తిరునహరి శ్రీధర్ తండ్రి జ్ఞాపకార్థం డొనేట్ చేసిన టై, బెల్ట్, ఐడీ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు డి.శారద, కె.శ్రవణ్ కుమార్, పి.ఉష, టి.జ్యోతి, యం.గౌతమ్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేత్ర,అవయవ, శరీర దానంపై అవగాహన



**వరంగల్ వాయిస్, కేయూ :** జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా బుధవారం కాకతీయ యూనివర్సిటీ ప్లేగ్రౌండ్ లో "నేత్ర, అవయవ శరీర దానం"పై తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకర్స్ అందరికీ అవగాహన కల్పించారు. మరణానంతరం నేత్రదానం చేస్తే ఇద్దరి అంధులకు చూపునిస్తుందని, నేత్ర వైద్యకు ఉపయోగపడుతుందని, అదే క్రమంలో పార్థివ దేహాన్ని మెడికల్ కాలేజీకి దానం చేస్తే ఎంబీబీఎస్ విద్యార్థులకు వైద్య విద్యకు తోడ్పడుతుందని, మరి శాస్త్ర పరిశోధనకు ఉపయోగపడుతుందన్నారు. చాలామంది పాజిటివ్ గా స్పందించి నేత్ర, అవయవ, శరీర దానం చేయుటకు ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, సలహాదారు రాజేంద్రప్రసాద్, పరికిపండ్ల వేణు, సంయుక్త కార్యదర్శి కేదారి, వెంకటేశ్వర్లు, నరేష్, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

### బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాకేష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ విద్యాశాఖ సమగ్ర శిక్ష ఉద్యోగులు తమను రెగ్యులరైజ్ చెయ్యాలని, పే స్కేలు అమలు, ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర డిమాండ్లతో ఏకశీలా పార్క్ వద్ద చేపట్టిన రిలే నిరాహారీక్షకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్ రెడ్డిసంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ కార్యాలయాల్లో జిల్లాల, మండల స్థాయిలో భవిత కేంద్రంలో, స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో వివిధ హోదాల్లో 21,000 పైగా కాంట్రాక్ట్ ఉద్యోగులము గత 15 ఏళ్లు గా పనిచేస్తున్నారని, విద్యాశాఖలో కీలకంగా ఉంటూ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి మా వంతు కృషి చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను ఆదుకోవాలన్నారు. వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# బీసీలలో ఆత్మ గౌరవాన్నినింపింది సీఎం కేసీఆరే

## వకుళాభరణం కృష్ణ మోహన్ రావు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** బీసీ, ఎంబీసీ, సంచార, అర్థ సంచార, సామాజిక వర్గాలు ఐకమత్యంతో తమ ఉనికిని చాటుకున్నప్పుడే సమాజంలో సముచిత గౌరవం లభిస్తుందని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు అన్నారు. బలహీన వర్గాలను అన్ని రంగాలలో ఎదిగించడానికి సీఎం కేసీఆర్ చేస్తున్న కృషి అమూల్యమైనది అన్నారు. వేలాది కోట్ల రూపాయల ఖరీదైన భూములను ఉచితంగా కుల సంఘ భవనాలకు కేటాయించి ఈ వర్గాల ఆత్మ గౌరవాన్ని పెంచడంలో సీఎం కేసీఆర్ దార్శనికత అనిర్వచనీయమైనదని డాక్టర్ వకుళాభరణం అన్నారు. బుధవారం ఉప్పల్ భగాయత్ లో వడ్డెరలకు కేటాయించిన ఒక ఎకరం, సంచార కులాలకు కేటాయించిన పది ఎకరాలకు భూమి పూజ చేసి, శిలా ఫలకాలను డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు శంకు స్థాపన చేసారు. బీసీ కమిషన్ సభ్యులు సీహెచ్ ఉపేంద్ర, కె.కిశోర్ గౌడ్ లతో పాటుగా బీసీ సంక్షేమ అధికారులు, కె.అలోక్ కుమార్, డి.శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు, వడ్డెర, సంచార కులాల ప్రతినిధులు ఆలకుంట హరి, ఎత్తరి అంతయ్య, ట్రస్ట్ ఛైర్మన్ జరిపాటి సత్యనారాయణ రాజు, వెంకట స్వామి, మొగిలి వెంకట స్వామి, మురారి, డాక్టర్ ఒర్స్ కృష్ణయ్య, ఒంటేద్దుల నరేందర్, నాగరాజు, వై.వెంకట నారాయణ, భూపతి సాగర్, పాండు వంశరాజ్, మల్లేశం వంశరాజ్, బెక్కం వెంకట్, నరహరి, వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అన్నాచెల్లెళ్ల ప్రేమానురాగానికి ప్రతీక రక్షాబంధన్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఏకశిలా టెక్నో స్కూల్ పెంబర్తి హసన్ పర్తిలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. చంద్రయాన్ -3 విజయవంతమైనందున ఇస్రో తయారుచేసిన రాకెట్ ప్రతిమతో అతిపెద్ద రాఖీని తయారు చేశారు. విద్యార్థినీ, విద్యార్థులు అందరూ రాఖీలు కట్టుకొని ముందస్తు రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకశిలా విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతి రెడ్డి మాట్లాడుతూ అన్నాచెల్లెళ్ల ప్రేమానురాగాలకు రక్షాబంధన్ ప్రతీక అని ఇటువంటి కార్యక్రమాలు పాఠశాలలో జరపడం ద్వారా విద్యార్థినీ విద్యార్థుల మధ్య సహృద్భావం తో కూడిన స్నేహపూర్వక వాతావరణం నెలకొంటుందని తెలిపారు. విద్యార్థిని విద్యార్థులందరూ స్వార్థం అసూయ వంటి చెడు లక్షణాలు వదిలిపెట్టి మిత్రభావంతో,నిస్వార్థంగా, నిజాయితీగా ఒకరికొకరు తోడ్పడుతూ కలిసి ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏకశిలా విద్యాసంస్థల డైరెక్టర్ గౌరు సువిజారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ కేడీ స్వర్ణరాజ్, అడ్మినిస్ట్రేటివ్ ఇంచార్జి రాంప్రసాద్ నవీన్ జోసఫ్, సునీత, కీర్తన, ధనలక్ష్మి పాల్గొన్నారు.

## అక్షర కాన్సెప్ట్ స్కూల్‌లో..



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** రక్షా బంధన్ వేడుకలను అక్షర కాన్సెప్ట్ స్కూల్ లో ఘనంగా నిర్వహించారు. బాలురకు బాలికలతో రాఖీలు కట్టించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ బిజ్జు పీటర్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయంలో భాగమైన రక్షా బంధన్ అన్నా చెల్లెళ్ళ అనుబంధానికి గుర్తుగా కులాలు మతాలతో సంబంధం లేకుండా నిర్వహించుకుంటారని, పాఠశాలలో చదివే విద్యార్థులు అన్నా చెల్లెల్లు అక్క తమ్ముళ్ల వలె మెలగాలని విద్యార్థులతో రక్ష బంధన్ వేడుకలను నిర్వహించామని తెలిపారు. ఈ వేడుకల్లో పాఠశాల ప్రిన్సిపాల్ షీనా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గోమతి స్కూల్ లో రాఖీ సంబురాలు..



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గిర్మాజీ పేట బొడ్రాయి వద్ద గల గోమతి పబ్లిక్ స్కూల్ లో బుధవారం ముందస్తుగా రక్షాబంధన్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కూచన క్రాంతి కుమార్ మాట్లాడుతూ సోదర, సోదరీమణుల ప్రేమకు ప్రతీక ఈ రక్షాబంధన్ పండుగని, దాని విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థినిలు, విద్యార్థులకు రక్షా బంధన్ కట్టి రాఖీ శుభాకాంక్షలు తెలియజేసుకోవడం జరిగింది. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆడెపు హారతి, ఇంచార్జి కరుణ, ఉపాధ్యాయులు సంధ్య, శ్రుతి, శ్రీ విద్య, సంయుక్త, శ్రావణి, విద్యార్థులు పాల్గొన్నారు.



## చంద్రముఖిగా కంగనా మెప్పించేనా?

సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా 2005లో విడుదలై సంచలన విజయం సాధించిన చిత్రం 'చంద్రముఖి'. మలయాళ బ్లాక్ బస్టర్ 'మణిచిత్రతాళ్' ఆధారంగా ఈ సినిమాని దర్శకుడు పి.వాసు తలైవాతో రీమేక్ చేశారు. జ్యోతిక టైటిల్ పాత్రలో నటించగా శివాజీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నటుడు ప్రభు, అతని సోదరుడు రామ్ కుమార్ గణెశిషన్ సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా మరోసారి రుజువు చేసి కాసుల వర్షం కురిపించింది. తమిళంతో పాటు తెలుగులోనూ బాక్సాఫీస్ వద్ద రజనీ కెరీర్ బెస్ట్ వసూళ్లని రాబట్టి సరికొత్త రికార్డుని సృష్టించింది. ఇందులో రజనీ మేనరిజమ్స్,స్టైల్స్ ఒకెత్తయితే కళ్లతో అద్భుతాభినయాన్ని కనబరిచి భయపెట్టిన జ్యోతిక నటన మరో ఎత్తు. కళ్లతో అభినయించిన జ్యోతిక తలైవానే డామినేట్ చేసి సినిమా విజయంలో కీలక పాత్ర పోషించింది. క్లైమాక్స్‌లో కళ్లతో జ్యోతికి చేసిన అభినయానికి ఫిదా కాని ప్రేక్షకుడు లేడంటే అది అతిశయోక్తి కాదేమో. ఇన్నేళ్ల విరామం తరువాత 'చంధ్రముఖి' సినిమాకు సీక్వెల్‌ని లైకా ప్రొడక్షన్స్ వారు తెరపైకి తీసుకొచ్చారు. అయితే ఇందులో రజనీ లేరు. జ్యోతిక అంతకన్నా లేదు. రాఘవ లారెన్స్, కంగన రౌత్ నటించారు. పి. వాసు డైరెక్ట్ చేశారు. చంద్రముఖి అనగానే అంచనాలు కచ్చితంగా ఉంటాయి. అదే ఈ సినిమాకు బిగ్ డ్యామేజ్ అయ్యేలా కనిపిస్తోంది. కీలక పాత్రల్లో రజనీ, జ్యోతికలని చూసిన ప్రేక్షకులు ఆ పాత్రల్లో ఇతరులని ఊహించుకోలేరు. ఇప్పుడు 'చంద్రముఖి 2' విషయంలో ఇదే జరుగుతోంది. రీసెంట్‌గా ఈ సినిమా నుంచి 'స్వాగతాంజలి' అంటూ సాగే ఓ లిరికల్ వీడియోని విడుదల చేశారు. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చంద్రముఖి పాత్రలో కంగన ఏం చేసినా జ్యోతికని మరిపించలేకపోతోంది. ఇదే ఈ సినిమాపై ప్రేక్షకులు విమర్శలు చేసేలా చేస్తోంది. గణెశిష్ చతుర్ధి సందర్భంగా పాన్ ఇండియా వైడ్‌గా రిలీజ్ కానున్న 'చంద్రముఖి 2' బాక్సాఫీస్ వద్ద మ్యాజిక్ చేస్తుందా? అన్నది అనుమానమనే కామెంట్లు వినిపిస్తున్నాయి.





## బీడీల గోల

### మహేశ్, నాగ్‌ల చిత్రాల పోస్టర్లపై చర్చ

మహేష్ బాబు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్ లో 'గుంటూరు కారం' సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ వేగం చూస్తుంటే, సంక్రాంతికి అనుకున్న తేదీకి మహేష్ బాబు సినిమా విడుదల అవొచ్చు అని అంటున్నారు. అంత వేగంగా త్రివిక్రమ్ శ్రీనివాస్ తీస్తున్నారని ఒక టాక్ నడుస్తోంది. ఈ సినిమా నుండి టీజర్, ఫస్ట్ లుక్ విడుదలయ్యాయి, అందులో మహేష్ బాబు బీడీ కలుస్తూ, లుంగీ కట్టుకొని వున్న ఫోటోస్ బాగా వైరల్ అయిన సంగతి తెలిసిందే.ఇప్పుడు అలాంటిది అంటే అదే బీడీ, లుంగీ లుక్ లో ఒక సీనియర్ నటుడు నాగార్జున కూడా కనిపించనున్నారు. నిన్న నాగార్జున పుట్టినరోజు సందర్భంగా విడుదలైన 'నా సామి రంగా' టీజర్ లో నాగార్జున బీడీ కలుస్తూ, లుంగీ కట్టిన సన్నివేశం చూసాం. విజయ్ బిన్నీ దీనికి దర్శకుడు కాగా, ఈ సినిమా కూడా సంక్రాంతికి విడుదల అని టీజర్ లో విడుదల తేదీ కూడా ప్రకటించేశారు. అంటీ ఈ రెండు బీడీలు, లుంగీలు కట్టుకున్న కథానాయకుల సినిమాలు సంక్రాంతికి పోటీ పడనున్నాయి అని అర్థం అవుతోంది. ఇదేంటి ఈ సంక్రాంతి పండగకి ఈ బీడీల గోల అని నెటిజన్స్ ఒకటే కామెంట్ చేస్తున్నారు. ఎందుకంటే ఇద్దరూ ఇంచు మించు ఒకటే లుక్ లో కనపడుతున్నారు, అలాగే ఇద్దరూ సంక్రాంతి పండగకు వస్తున్నారు, మరి ప్రేక్షకులు ఎలా ఆదరిస్తారో చూడాలి. అయితే సంక్రాంతికి ఎటువంటి సినిమా అయినా ఆ నాలుగు రోజులు బాగానే నడుస్తుంది అని, అందుకనే ఇద్దరూ సంక్రాంతికి వస్తున్నారని ఒక టాక్ నడుస్తోంది.



## స్కంధపై భారీ అంచనాలు

### ప్రమోషన్స్‌పై దృష్టి పెట్టిన మేకర్స్

వినాయక చవితికి నాలుగు రోజుల ముందే రిలీజవుతున్న స్కంద సినిమాపై మాస్ ఆడియెన్స్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. బోయపాటి వైలెన్స్ ఈ సారి ఊహించిన దానికంటే అరివీర భయంకరంగా ఉండబోతుందని గ్లింప్స్, ట్రైలర్‌లు గట్రా ఆల్రెడీ క్లారిటీ ఇచ్చేశాయి. ఇక ఈ సినిమాకు బిజినెస్ కూడా భారీ స్థాయిలోనే జరుగుతుందని తెలుస్తుంది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం రామ్ పోతినేని కెరీర్‌లో హైయెస్ట్ బిజినెస్ ఇదేనట.ఈ సినిమా అన్ని భాషల హక్కులు కలుపుకుని డిజిటల్, సాటిలైట్ హక్కులను స్టార్ సంస్థ రూ.45 కోట్లకు డీల్‌ను ఫిక్స్ చేసుకుందట. కేవలం నాన్-థియేట్రికల్ హక్కులే ఈ రేంజ్‌లో అమ్ముడయ్యాయంటే మామూలు విషయం కాదు.



# బోనమెత్తిన ఎమ్మెల్యే

**ఘనంగా పోచమ్మ బోనాల పండుగ**

**తరలి వచ్చిన మహిళా భక్తులు**





**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** శ్రావణ మాసం అంటేనే మహిళలకు పండుగల సమయం. బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో మహిళలు ఘనంగా పోచమ్మ బోనాల పండుగను నిర్వహించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోని శంభునిపేట బుడిగ జంగాల కాలనీ వాసులు సుమారు 200 కుటుంబాలు ఒకేసారి పోచమ్మ, మారెమ్మ బోనాల పండగను నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరైన భక్తులతో కలిసి బోనం ఎత్తారు. పోచమ్మ, మారెమ్మ ఆశీర్వాదంతో ప్రజలు అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో 37వ డివిజన్ కార్పొరేటర్ భోగి సువర్ణ సురేష్, బీఆర్ ఎస్ నాయకులు చెప్పు సునీల్, ఉల్ఫాత్, ఫిరోజ్, కాలనీ నాయకులు భిక్షపతి, రాజారాం, ఎల్లయ్య, మల్లికార్జున్, సంపత్, ఐలయ్యతో పాటు బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు, భక్తులు హాజరయ్యారు. ప్రతి ఏటా మాదిరిగానే 14వ డివిజన్ ఏనుమాముల బాలాజీ నగర్ లో బ్రాహ్మణ పోచమ్మ బోనాల పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. అమ్మవారికి బెల్లం శాకతో బోనం తీసుకొచ్చి అమ్మవారికి గాజులు పట్టుచీర సమర్పించి భక్తులు ముక్కలు చెల్లించుకున్నారు. డప్పుల దరువులు, శివసత్తుల పూనకాలతో మహిళలు ముందుకు సాగారు. ఈ కార్యక్రమానికి 14 డివిజన్ కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య, గ్రామ పెద్దలు పస్తం రాములు, తూర్పాటి కరంచంద్, బీఆర్ ఎస్ ప్రధాన కార్యదర్శి పత్రి సుభాష్, సీనియర్ నాయకులు పత్రి రాజా, పోషాల్, గంధం గోవిందు, తూర్పాటి రఘు, పత్రి యాకయ్య, పస్తం సతీష్, కిన్నెర, సతీష్, తూర్పాటి శ్రీను, పస్తం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పబ్లిక్ టీవీ న్యూస్ పదో వార్షికోత్సవం

**సీనియర్ జర్నలిస్టులకు ఘన సన్మానం**



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** పబ్లిక్ టీవీ న్యూస్ పదో వార్షికోత్సవం సందర్భంగా వరంగల్ జిల్లా శివనగర్ లోని భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన పబ్లిక్ టీవీ న్యూస్, ఏజెన్సీని బుధవారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్, వరంగల్ ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ వెంకన్నతో కలిసి ప్రారంభించారు. అంగరంగ వైభవంగా పబ్లిక్ టీవీ న్యూస్ పదో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పబ్లిక్ టీవీ సీఈవో తండ సరిత-విగ్నేష్ గౌడ్, ఎండి. పోలిశెట్టి సైదులు నాయుడులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎప్పటిలాగే నిజాలను నిర్భయంగా తెలుపుతూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య, బోల్ల అమర్, జనగాని ఆంజనేయులు, బీసీ సంఘ అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్, సోమిశెట్టి ప్రవీణ్ కుమార్, పబ్లిక్ టీవీ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ జమీల్ హుస్సేన్, న్యూస్ ఏజెన్సీ ఎండి కక్కర్ల సందీప్ గౌడ్, పబ్లిక్ టీవీ రిపోర్టర్లు దొంతి సంతోష్ గౌడ్, కొలిపాక భాస్కర్, బొల్లారం నాగరాజు, తంగళ్ళపల్లి శ్రీనివాస్ చారి, మెరుగు వినోద్, బందెల కృష్ణ, బెజ్జంకి సాంబమూర్తి, గరిగ సుమన్, రవితేజ, కక్కెర్ల నాగరాజు, పృథ్వి, ప్రకాష్, మర్ద రాజేష్, రవి, మచ్చ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, మాజీ అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్టు గడ్డం కేశవమూర్తిని శాలువాలతో ఘనంగా సత్కరించారు

# తల్వార్లతో ఉన్న ఫ్లెక్సీల తొలగింపు

**రంగంలోకి దిగిన పోలీసులు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తల్వార్లు, కత్తులను బహిరంగంగా ప్రదర్శించడంతో పాటు తల్వార్లు పట్టుకొని దిగిన ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలపై పోలీసులు చర్యలు చేపట్టారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే విధంగా ప్రధాన కూడళ్ళలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను బుధవారం పోలీసులు తొలగించారు. తల్వార్లు, కత్తులతో ఉన్న ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామంటూ వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించిన నేపథ్యంలో కేయూసీ పోలీసులు చర్యలను ప్రారంభించారు. గోపాల్ పూర్ రోడ్డులోని గ్రామ పంచాయతీ పరిసరాల్లో ఓ యువ నాయకుడు తల్వార్ పట్టుకొని ఉన్న ఫొటో ఫ్లెక్సీని పోలీసులు తొలగించారు.




# రేపటినుంచి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మెబాట

**నిలిచిపోనున్న వైద్య సేవలు**



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్ హెచ్ ఎం) లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ఈనెల 31 నుంచి సమ్మె బాట పట్టనున్నారు. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దావఖాణాలు, మాత శిశు సంరక్షణ కేంద్రాలు, నవజాత శిషు యూనిట్ లలో వైద్య సేవలు నిలిచిపోనున్నాయి. ఈ మేరకు బుధవారం ఎంజీఎం సూపరింటెండెంట్ వలుపదాసు చంద్రశేఖర్ తోపాటు సీకేఎం ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ కు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎన్ హెచ్ ఎం ఆల్ క్యాడర్ ఉద్యోగుల సంఘం ప్తరినిధులు సమ్మె నోటీసులు అందజేశారు. అనంతరం ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, ఎన్ హెచ్ ఎం అల్ క్యాడర్ వర్కర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేష్ కన్నా మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలోని వివిధ కేటగిరీల్లో ఏళ్ల తరబడి పని చేస్తున్న ఉద్యోగులను వెంటనే రెగ్యూలర్ చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాలతో పాటు నేటి ప్రభుత్వం కూడా హామీ ఇచ్చి విస్మరించడం శోచనీయమన్నారు. అదేవిధంగా సమన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. ఈ నెల 31 నుంచి హనుమకొండ జిల్లా బాలసముద్రంలోని ఏకశిలా పార్కు వద్ద నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమ్మె నివారణకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పుల రవి, జిల్లా సమితి సభ్యులు విక్టోరియా సుమలత, ఎన్ హెచ్ ఎం వరంగల్ డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ మేనేజర్ మెరుగు అనిల్ కుమార్, డాటా ఎంట్రీ ఆపరేటర్లు పృథ్వి, బెజ్జం అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఈ-వేస్ట్ మిషన్ ఆవిష్కరణ

**(మొదటి పేజీ తరువాయి.. )** కాగా వీటిని ఓ క్రమ పద్ధతిలో సేకరించి, శాస్త్రీయం పద్ధతిలో రీసైకిల్ చేస్తున్న సెలెక్ట్ మొబైల్స్ నిర్వాహకుల సేవలు ప్రశంసనీయమన్నారు. పనికిరాని ఎలక్ట్రానిక్ వస్తువులను సెలెక్ట్ రిటైల్ స్టోర్ లకు తీసుకు వచ్చే కస్టమర్లు రూ.1,000 మొదలుకుని రూ.10,000 వరకు డిస్కౌంట్ కూపన్ అందుకోవచ్చున్నారు. కూపన్ కాల పరిమితి ఆరు నెలల వరుకు ఉంటుంది. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ ఎస్.నవీన్ కుమార్, ఏరియా మేనేజర్ ప్రవళికతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు వృద్ధురాలి మృతి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ బస్టాండ్ లో ప్రమాదవశాత్తు గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందింది. ఆర్టీసీ బస్సు వెనక్కి తీస్తున్న క్రమంలో వృద్ధురాలికి ఢీ కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. హనుమకొండ పోలీసేలు ఘటన స్థలానికి చేరుకొని పోస్ట్ మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎంజీఎం కు తరలించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com